# ఒకటే ఒంటరి అంకె

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1978 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన నవల*

*(గత సంచిక తరువాయి)*

నెలలు గడుస్తున్నాయి. క్రమంగా త్రిపురంలో ఇదివరకెన్నడూ లేని కొత్త భావం చోటు చేసుకుంటోంది.

కాలేజీవున్న రోజుల్లో కాలేజీకి వెళ్ళటం, రావడంతో రోజు గడిచిపోతుంది. కాని శెలవురోజుల్లో - ముఖ్యంగా వరసగా శెలవులు వచ్చినప్పుడు త్రిపురానికి భయంగా ఉంటోంది మానసికంగా.

ఫస్ట్టర్మ్‌కి సెకండ్ టర్మ్‌కి మధ్య శెలవలు ఎలా గడపాలో అర్ధంకాలేదు. శెలవల్లో ఎంతో వంటరిగా ఉన్న భావన ఎక్కువవుతోంది త్రిపురానికి. స్నేహితులు తక్కువ. ఉన్న కొద్దిగంటలే వాళ్ళతో గడపగలదు. ఖాళీ సమయం ఇంట్లో తప్ప బయట గడపలేదు. ఇంట్లో ఉంటే ఆలోచనలు.

తను వంటరిదయిందన్న ఆలోచన తినేస్తోంది త్రిపురాన్ని. తల్లి లేదు. సునీత ఇంటికి వెళ్ళడానికి కూడా మనసొప్పలేదు. చుట్టూ ఎవరూ లేరు. తనకంటూ ఎవరూ లేరు. ఈ లోకంలో తను వంటరిది.

అవును. తనీ లోకంలో పూర్తిగా వంటరిది. ముఖ్యంగా వంట చేసుకుని అన్నం తినేటప్పుడు ఒకోసారి బాధ ఎక్కువవుతుంది. తల్లి దగ్గరుండి వడ్డించేది. అన్నం తనంతట తను వడ్డించుకుని తినటం కొత్త. ఎన్ని నెలలు గడిచినా దానికి అలవాటు కాలేకపోతోంది.

ఒక్కోసారి విసుగేసి అన్నం వండుకు తినటం కూడా మానేయసాగింది. క్రమంగా అసలు అన్నం వండుకోవటం మానేసింది త్రిపురం.

ఉదయం హోటల్లో టిఫిన్ తిని వెళుతుంది కాలేజీకి. లంచ్ అవర్‌లో పళ్ళు తింటుంది, రాత్రి జామ్ రాసుకున్న బ్రెడ్ తిని ఓ మాత్ర వేసుకుని పుస్తకం తిరగేస్తూ పడుకుంటుంది నిద్రవచ్చేదాకా.

ఓ రోజు శుభలేఖ, పెళ్ళికి తప్పక రమ్మనమని ఉత్తరం త్రిపుర అన్నయ్య నుంచి వచ్చాయి. త్రిపురానికి వెళ్ళాలనిపించలేదు. బేంక్ లోంచి డబ్బు విత్ డ్రా చేసి కాలేజీ నుంచి, సాయంత్రం ఓ చీరల దుకాణానికి వెళ్ళింది. రెండు ఖరీదైన చీరలు, జాకెట్లు కొన్నది అన్నయ్య కూతుళ్ళిద్దరి కోసం.

చీరల మడతలలో పసుపు, కుంకుమ పొట్లాలు ఉంచి వాటిని విడివిడిగా పేక్ చేసింది. ఇద్దరి పేర్లు సీల్ చేసిన కవర్ల మీద వ్రాసి చిరునామాలు వ్రాసింది. వాటిని రిజిష్టర్డు పోస్టు పార్సెల్‌లో ఇన్సూర్ చేసి పంపించింది పెళ్ళికి రెండు రోజుల ముందు అందే విధంగా.

శెలవు దొరకలేదనీ, పిల్లల పరీక్షలు దగ్గిర పడటంతో ప్రత్యేకంగా క్లాసెస్ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందనీ, అందుకని రాలేకపోతున్నాననీ ఉత్తరం రాసింది అన్నయ్యకి విడిగా.

ఆ చీరలు చూసి సంతోషపడతాడు తప్పకుండా. తను రానందుకు ఏ మాత్రం విచారించడు. మొదటినుంచీ వాడికి మనుషుల మీదకన్నా డబ్బుమీద మమకారం హెచ్చు. సునీత వెళుతుందా పెళ్ళికి?

సునీత గుర్తుకు రాగానే 'అక్కయ్య ఎలావుందో?' అనిపించింది త్రిపురానికి. 'ఒక్కసారి చూస్తే బావుణ్ను' అని కూడా అనిపించింది కాని సునీత ఇంటికి వెళ్ళే ధైర్యం చేయలేదు త్రిపురం.

తనని చూసి మొహం మీద తలుపేసుకుంటుందన్న భయంకాదు - ఎలాంటి వాతావరణంలో సునీతని చూడాల్సి వస్తుందోననే భయంతో.

ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఒకరోజు చెప్పాడు త్రిపురంతో.

"విద్యానగర్‌లో ఓ ఇల్లు అమ్మకానికి వచ్చింది. చాలాకాలం నుంచి ఇంటికోసం వెదుకుతున్నాను మీకోసమే, యూనివర్సిటీకి దగ్గర ఇంట్రెస్టుందా?"

"ఉంది."

"నాకు తెలిసినవాళ్ళదే ఇల్లు. రేపు సాయంత్రం వచ్చి తీసుకు వెళతారు ఇల్లు చూపించడానికి. ఇల్లు నచ్చితే ధర గురించి మీ ఇద్దరూ ఓ ఒప్పందానికి వచ్చాక రిజిష్టర్ చేయించుకోండి.. ఈ రోజుల్లో ఓ సొంత ఇల్లు ఉండటం మంచిదని కొనిస్తున్నాను మీచేత."

"థాంక్స్ సర్." అన్నది త్రిపురం.

నెల రోజుల తర్వాత ఇల్లు త్రిపురం పేర రిజిస్టర్ అయింది. ఓ మంచి రోజు చూసుకుని కొత్త ఇంట్లోకి మారింది త్రిపురం. ఈసారి సామాను తనే మార్చింది. నాలుగు గదుల ఇల్లు అది. ముందు డ్రాయింగ్ రూం, కిచిన్, బెడ్ రూం, స్టోర్ రూం.

బెడ్ రూంలో తన తండ్రి సామాను వుండే అద్దాల బీరువానీ, తన పుస్తకాల బీరువాని పెట్టించింది. వారం రోజులు ఇల్లు సర్దుకోవడమే సరిపోయింది శెలవుల్లో. సొంత ఇంటిలోకి మారాక త్రిపురానికి తను 'వంటరిది' అనే భావన తగ్గింది కొద్దిగా. ఓ విధమైన తృప్తి ఏర్పడింది.

ఆ సంవత్సరం శిస్తు రాలేదు త్రిపురానికి. అవసరంలేక ఎదురుచూడలేదు దానికోసం. ఎందుకో ఓ రోజు గుర్తుకు వచ్చింది చటుక్కున. రేపల్లెలోని భూమిని కౌలుకి తీసుకున్నవాళ్ళకి ఉత్తరం రాసింది. వారం తర్వాత జవాబు వచ్చింది త్రిపురం అన్నయ్య వచ్చి సొమ్ము వసూలు చేసుకుని వెళ్ళినట్లుగా. అన్నయ్యకి వెంటనే ఉత్తరం రాసింది త్రిపురం ఆ సంగతి గురించి. దాన్ని పోస్టు డబ్బాలో వేయబోతూ ఆగిపోయింది. మర్నాడు ఉదయం కొన్ని క్షణాలు ఆలోచించి ఆ ఉత్తరాన్ని పోస్టు చేయలేదు. చింపేసింది.

తను ఆ డబ్బు లేకపోతే బ్రతకలేదా?

**

రోజులు వారాలై, వారాలు నెలలుగా మారిపోతున్నాయి. త్రిపురానికి మనసులో తల్లి జ్ఞాపకాలు పోవటంలేదు. రోజూ గుర్తొస్తుంది తల్లి. సునీత గుర్తొస్తుంది. అన్నయ్య మాత్రం గుర్తురాడు.

నాలుగైదు ఉత్తరాలు వ్రాసింది సునీతకి, బావగారికి. సమాధానాలు రాలేదు. తనకీ సునీతకీ పూర్తిగా తెగిపోయిందన్న సంగతి స్పష్టమైంది త్రిపురానికి.

సాయంత్రం కాలేజ్ నుంచి ఇంటికి వచ్చాక మొదలవుతుంది వంటరితనం. రాత్రి నిద్రపట్టేదాకా నాలుగు గదుల ఆ పెద్ద ఇంట్లో తనొక్కదాన్నే ఉంటానన్న సంగతి మర్చిపోదామన్నా కుదరటం లేదు.

ఎంతో వంటరిగా ఫీల్ అవుతుంది. తన తల్లి ఇంకా కొంతకాలం బ్రతికి ఉంటే బావుణ్ణి అనిపిస్తుంది. పుస్తకాలు చదువుకుంటుంది. నిద్రమాత్ర వేసుకుని ఎప్పుడు నిద్రవస్తే అప్పుడు మంచం మీదకి చేరుతుంది. ఒకోసారి అలాగే కుర్చీలో వాలిపోతుంది నిద్రలో.

ప్రక్క పోర్షన్‌లో పంజాబీలు ఉంటున్నారు. మొగుడు, పెళ్ళాం, ఇద్దరు పిల్లలు. కుర్చీ కిటికీ దగ్గర వేసుకుని వాళ్ళని చూస్తూ కూర్చుంటుంది ఒకోసారి.

కాంపౌండులో పిల్లలిద్దరూ ఆడుకుంటుటే, దంపతులిద్దరూ సాయింత్రం కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటుంటారు. ఇద్దరి మొహాల్లో అలసట, విసుగు కొద్దిగా కూడా ఉండవు. ఎంతో సంతోషంగా నవ్వుతుంటారు ఎప్పుడూ.

అదీ జీవితం. పరిపూర్ణమైన జీవితం అది. వంటరితనం, విసుగు, విచారం ఉండవు. మధ్యలో పిల్లలిద్దరూ పోట్లాడుకుని తల్లితండ్రుల దగ్గరికి వస్తారు పరిగెత్తుకుంటూ.

త్రిపురానికి తన చిన్నతనపు రోజులు గుర్తుకువస్తాయి ఆ దృశ్యం చూస్తూంటే. మనసు మరీ బాధగా ఉంటే తన తండ్రి వాడిన వస్తువులున్న బీరువా దగ్గరికి వెళ్ళి నిలుచుంటుంది. వాటిని చాలాసేపు చూస్తుంది.

ఒకరోజు త్రిపురం బావ శేఖర్ పెళ్ళాంతో, ఇద్దరు పిల్లలతో వచ్చి దిగాడు.

''ఏమిటి? వంట చేసుకోవడం లేదా ఇంట్లో?'' అడిగాడు ఆశ్చర్యంగా కేరియర్ తెప్పిస్తే.

''లేదు.''

''వంట నేర్చుకోకపోవడం వల్ల వచ్చే ఇబ్బంది ఇది.''

వంట వచ్చని చెప్పలేదు.. నవ్వింది. శేఖర్ రెండు రోజులున్నాడు. తను పనిచేసే బేంక్ యూనియన్ తరపున వచ్చాడు హైదరాబాద్. వెళ్ళబోయేముందు త్రిపురంతో మాట్లాడాడు.

''పెళ్ళిచేసుకోవా ఇంక?''

''ఏం?''

''అలా అనిపిస్తోంది నిన్ను చూస్తూంటే.''

''చేసుకుంటాను.''

''ఆలస్యం అమృతం విషం.''

''అంటే నేను విషమా?''

''నీవు నాకు ఒకప్పుడు అమృతంలా కనిపించావ్''

శేఖర్ తనని పెళ్ళి చేసుకోమని అడిగిన రోజు గుర్తుకు వచ్చింది త్రిపురానికి. నవ్వింది.

''ఏ రోజు?'' అడిగింది.

''కోపం వచ్చి నాతో మాట్లాడలేదు కూడా. సిల్లీ ప్రశ్నలు వేసిన రోజు.''

మళ్ళీ నవ్వింది త్రిపురం తను వోణీ వేసుకున్న రోజు గుర్తుకు వచ్చింది.

''కావాలని నీవు వంటరిగా ఉండటం చూసే ఈ విషయ చెపుతున్నాను. త్వర పెళ్ళిచేసుకో తోడు దొరికితే కాని జీవితం స్థిరపడినట్లు కాదు అప్పుడే జీవితం సాఫీగా సాగేది.''

''థాంక్స్ ఫర్ యువర్ ఎడ్వైస్.''

''నీ కిప్పుడు ముప్పైఏడు కదా?''

"అవును"

"త్వరలో నలభై ఏడు కూడా వస్తుంది. వి మస్ట్ మేక్ యు జ్ ఆఫ్ లైఫ్ బిఫోర్ ఇట్ గోస్ అవుట్ ఆఫ్ అవర్ హేండ్స్."

త్రిపురం మాట్లాడలేదు.

"నీకు కోపం రాకుండా వుంటే ఓ సంగతి చెప్పనా?"

"చెప్పు."

"నువ్వు ఫ్రిజిడ్‌వని నా కనుమానం."

వేడి కత్తితో బుగ్గమీద వాత పెట్టినట్లుగా ఫీలయింది త్రిపురం వెంటనే.

కోపంగా కనుబొమ్మలు ముడుచుకున్నాయ్.

"కోపం తెచ్చుకోక. లేకపోతే భర్తపొందు, పిల్లలు, స్వీట్ నైట్స్ గురించి ఎప్పుడూ ఆలోచించలేదా నువ్వు? ఆలోచించి ఉండవు. నీ మనసంతా మొదటి నుంచీ చదువుమీదే ఆ మైకం పూర్తిగా కమ్మేసింది నిన్ను. దాంతో నీలోని కొన్ని ముఖ్యమైన గ్లాండ్స్ పనిచేసి ఉండవు. సారీ ఇలా చెపుతున్నందుకు."

త్రిపురం మాట్లాడలేకపోయింది వెంటనే. కోపంతో మొహం జేవురించింది.

"సైంటిఫిక్‌గా నే చెప్పేది ఎంతవరకు నిజమో నాకు తెలియదు కాని నా ఉద్దేశం అది. నీ జీవితం మామూలుగా అందరు ఆడపిల్లలు నడిచే పట్టాల మీద వెళ్ళటం లేదు మొదటినుంచి."

"చెప్పదలచుకున్నది చెప్పు."

కోపం వచ్చి, నిగ్రహించుకుని చెప్పింది త్రిపురం నవ్వి. ఆ నవ్వులో కూడా కోపం కనబడింది శేఖర్‌కి.

"నాకు తెలుసు. ఇలా చెప్పి నిన్ను హర్ట్ చేసిన వాడినవుతానని. కాని నాకు బాధలేదు. నువు నన్ను చెడ్డగా అనుకున్నా. నీకు ఇలా చెప్పేందుకు దగ్గర వాళ్ళెవ్వరూలేరు. సునీత, మీ అన్నయ్య ఇద్దరూ నీ గురించి ఆలోచించటం ఎప్పుడో మానేశారు!"

త్రిపురం తల వంచుకుంది!

"నీ పుస్తకాల రేక్‌లోని పుస్తకాలన్నీ చదివే ఉంటావ్. నాకన్నా ఎక్కువ చదువుకున్నదానివి. ఆంగ్ల సాహిత్యంలో అపరిమితమయిన జ్ఞానం సంపాదించినదానివి. కానీ నీకు జీవితం గురించి ఆలోచించే తీరిక లేదా?"

పేలవంగా నవ్వింది త్రిపురం!

"కింగ్‌లియర్ చదివావు కదా?"

"చదివాను!"

"దాంట్లో కింగ్‌లియర్ అవసానదశలో కూతుళ్ళచేత తరమబడి మంచు తుఫానులో చిక్కుకుని తన వంటరితనంతో తనని చూసుకునే మనుషులు లేరనే వెలితితో పడే బాధ షేక్స్పియర్ ఎంత బాగా వర్ణించాడో నీకు తెలుసు. బహుశా లెక్క లేవన్నిసార్లు అది నీ విద్యార్థులకు విపులంగా చెప్పివుంటావ్. నీ జీవితానికి ఆ బాధ అన్వయించుకో. అంతే నే చెప్పేది!"

"థాంన్స్ ఫర్ యువర్ అడ్వైజ్!"

"నా ఫ్రెండొకతను ఉన్నాడు. అతనూ నీలాగే ఇంతదాకా వివాహం చేసుకోలేదు. పెళ్ళంటే మొదటి నుంచి ఇష్టంలేదు. అది కేవలం బ్రేక్‌ఫాస్ట్, బ్రెడ్ అండ్ బెడ్ కోసమేగా, అని పెళ్ళికాకుండా కూడా నాకు దొరుకుతున్నాయి" అంటారు. అఫ్‌కోర్స్. అతను మొగాడు కాబట్టి చెల్లుతుంది. కాని మన సమాజంలో ఆడవాళ్ళకి ఆ ప్రివిలేజ్ లేదు.!"

త్రిపురం బదులుగా నవ్వింది తప్ప ఈసారి మాట్లాడలేదు!

"చూడు త్రిపురం ఎప్పుడూ ఎవరూ ఇది మాత్రం మరిచిపోకు. ఒకటి ఒంటరి అంకె - ఒన్ ఈజ్ ఏ వెరీ లోన్లీ నెంబర్"

శేఖర్ వెళ్ళిపోయినా శేఖర్ అన్న ప్రతిమాట సారాంశం త్రిపురం మనసులోకి బాగా ఇంకింది.

అంతా తనని ఫ్రిజిడ్‌గా భావిస్తున్నారా! సెక్స్ పరంగా తనకి నిజంగా ఎన్నడూ కోరిక కలుగలేదు. తనలో నిజంగా అపరమైన భావరాహిత్యం ఉందా? అందరిలా కాదా తను?

రాత్రి శేఖర్ బస్సులో వెళ్ళిపోయాడు భార్యాపిల్లలతో. ఆ రాత్రి చాలాసేపు మేలుకుని ఆలోచిస్తూండిపోయింది శేఖర్ చెప్పిన విషయాలు. గుండెనిండా క్రమంగా బాధ గూడకట్టుకుంది.

తల్లి మరణించాక మొదటిసారిగా ఏడ్చింది త్రిపురం. వస్తోన్న ఏడుపుని కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నించలేదు. తెరలు తెరలుగా వస్తున్న ఏడుపు, ఏడుస్తున్న కొద్ది అధికం అయింది. మొహాన్ని మోకాళ్ళ మధ్య ఉంచుకుని చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది పావుగంటసేపు.

ఏడుపు తగ్గాక గుండెలో బాధకూడా తగ్గినట్లు ఫీలయింది. ఆశ్చర్యం వేసింది, త్రిపురానికి మనసు తీరా ఏడ్చాక అది ఎంతో తేటపడటం. ఇదివరలో ఇలాంటి అనుభవం కలుగలేదు. బాధకి పగ్గాలు వేసి పట్టుకుని ఆపేది. కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన ఆ బాధంతా ఏడుపు రూపంలో కొంతదాకా బయటకి వెళ్ళిపోయినట్లుగా అనిపించింది!

ఇంత చదువుకుని, స్వతంత్రంగా బ్రతకగలుగుతున్న తను ఎలా ఏడవగలిగింది? ఆశ్చర్యం వేసింది త్రిపురానికి. ఆ రాత్రి నిద్రమాత్రలు లేకుండా ఎంతో హాయిగా నిద్రపట్టింది త్రిపురానికి.

## 11

చాలాసార్లు అతన్ని చూసింది త్రిపురం.

ఉదయం కాలేజీకి వెళుతూనో, కాలేజి నుంచి ఇంటికి తిరిగి వెళుతూనో విద్యానగర్‌లోని ఓ షాపులో పత్రికలు, నవలలు అద్దెకి తీసుకుంటుంది. రెండురోజులకొకసారయినా ఆ షాప్‌కి వెళుతుంది.

ఆ షాప్‌లో స్టూల్ మీద కూర్చుని ఉంటాడు. అతనెప్పుడూ, మిత్రులతో కబుర్లు చెబుతూ, నల్లటి ఉంగరాల జుట్టు అతనిలో ప్రత్యేకత.

ఓ సాయంత్రం కిటికీ దగ్గర కూర్చుని ప్రక్కింటి వాళ్ళని చూస్తూంటే కాలింగ్‌బెల్ మ్రోగింది. తనకోసం ఆ సమయంలో వచ్చేవారు అరుదు. లేచి తలుపు తెరిచింది త్రిపురం. ఎదురుగా గుమ్మం అవతల అద్దెకిచ్చే పుస్తకాల షాపులోని కుర్రాడు.

"యస్" అడిగింది త్రిపురం.

"ఉదయ ఇర్వింగు స్టోన్ నవల 'లస్ట్ ఫర్ లైఫ్' తీసుకున్నారు కదా?" అడిగాడు తెలుగులో.

"అవును!"

"పొరపాటున ఇచ్చాం ఆ పుస్తకం. అది దుకాణంలోది కాదు. షాప్‌కి వచ్చే ఓ స్నేహితుడిది. ఆ పుస్తకం అడుగుతున్నాడు. మీరు ఇచ్చేస్తే..." అని అడిగాడు.

"ఓ! అయామ్ సారీ! అది డిపార్టుమెంట్‌లో మా ఆఫీస్ డ్రాయర్‌లో ఉంది. అక్కడే పెట్టేసాను. రేపు సాయంత్రం ఇస్తాను"

"నా పేరు ప్రసాద్" చెప్పాడు నవ్వుతూ.

"మీకు తెలుసనుకుంటాను! నా పేరు త్రిపురం అని" బదులుగా నవ్వింది!

"తెలుసు. మీరు లెక్చరర్ కదా?"

"అవును! రండి లోపలికి!"

"వెళతాను! అతను ఎదురు చూస్తుంటాడు"

వెళ్ళిపోయాడు వెంటనే.

మర్నాడు సాయంత్రం త్రిపురం ఆ పుస్తకం తిరిగి ఇచ్చేయడానికి షాప్‌లోకి వెళ్ళింది. ప్రసాద్ లేడు. ఆ షాప్ యజమాని ప్రసాద్ ఈడువాడే ఉన్నాడు. ఆ తర్వాత ప్రసాద్ ఆ షాప్‌లో ఉన్నప్పుడల్లా పలకరించేవాడు త్రిపురాన్ని. ప్రసాద్ గురించి అట్టే ఆలోచించలేదు త్రిపురం ఎప్పుడూ. ఓ రోజు సాయంత్రం మళ్ళీ వచ్చాడు ప్రసాద్.

"రండి" ఆహ్వానించింది.

"డిస్టర్బ్ చేయటంలేదుకదా?" అడిగాడు మధ్యకి మడిచి ఉన్న నవలను చూస్తూ.

"లేదు!"

కుర్చీలో కూర్చున్నాడు.

"సోమర్ సెట్ మామ్ నవల 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' తెప్పించమని చెప్పాను. దాంట్లో రెండు ఎడిషన్స్ ఉన్నాయి. ఒకటి ఎ బ్రిడ్జిడ్ ఒకటి ఆన్ ఎబ్రిడ్జిడ్!"

"నేను సరదాగా ఆ షాప్‌లో కూర్చుంటాను. ఖాళీగా ఉన్నాను కాబట్టి"

"మీరేం చేస్తున్నారు?"

"నిరుద్యోగిని."

"మంచి ఉద్యోగమే" నవ్వింది త్రిపురం.

"సినిమాలో పాటలు పాడే ఛాన్స్‌కోసం ప్రయత్నిస్తున్నాను."

"మీరు పాడతారా?"

"బాగా మా కాలేజీ ఫంక్షన్స్‌లో నేనే పాడేవాడిని. నలుగురయిదుగురు నిర్మాతలు ఛాన్స్ ఇస్తామని ప్రామిస్ చేశారు కూడా. ఆడిషన్ టెస్ట్‌కూడా అయింది!"

"కంగ్రాచ్యులేషన్స్!"

"మీ దగ్గర నోట్ పుస్తకం ఏదయినా ఉందా?"

లేచి ఓ నోట్ పుస్తకం తీసి అందించింది.

"నిజంగా ఇచ్చారా? సంతకం చేయనా?" అడిగాడు సీరియస్‌గా.

"ఏం?"

"తర్వాత నా ఆటోగ్రాఫ్ కావాలంటే దొరకదు. మద్రాసు వెళ్ళాక నన్ను పట్టుకోవడం కష్టం. రోజుకి నాలుగయిదు పాటలు పాడేస్తుంటాను!"

నవ్వింది త్రిపురం.

"పాడమని అడుగుతారని నా గురించి ఇంత డబ్బా వాయించుకుంటున్నా. ఒకసారి పాడమని అడగరే?.. భయపడకండి. అయిదు వందలు పెడితేగాని పాడను నేను. నా రేటది."

మళ్ళీ నవ్వింది త్రిపురం.

"వినాయక చవితికి చిన్న ఫంక్షన్ చేస్తున్నాం. చందా వసూలు చేద్దామని వచ్చాను."

ప్రసాద్ చందా పుస్తకం తెరచి త్రిపురం పేరు వ్రాసి అడిగాడు.

"వంద రాయనా!"

"వందే?" ఆశ్చర్యంగా అడిగింది త్రిపురం!

"పైసలు."

రాసి. కౌంటర్ ఫాయిల్ చింపి టేబుల్ మీద పెడుతూ అన్నాడు.

"స్టైయిల్‌గా వంద అనాలి. మరీ ఒక్క రూపాయి అంటే బావుండదు."

త్రిపురం లోపలికి వెళ్ళి రూపాయి తెచ్చి ఇచ్చింది.

"థాంక్స్ మేడమ్. మీరు తప్పక రావాలి. నేను జానపద పాటలు పాడుతాను. ఈ పక్కనే పందిరి వేస్తున్నాం"

"అలాగే వస్తాను."

"వద్దనుకున్నా నా పాటలు వినబడతాయి. మైకు ఒకటి ప్రత్యేకంగా మీ ఇంటివైపు ఏర్పాటు చేస్తేనే పాడతానంటాను."

లేచాడు. "టీ తీసుకుని వెళ్ళండి."

"వద్దు."

"ఫర్వాలేదు."

"వద్దు కాఫీ ఇవ్వండి. చక్కెర తక్కువ."

ఈసారి నవ్వు త్రిపురానికి తెలియకుండానే వచ్చేసింది.

పావుగంట తర్వాత వెళ్ళిపోయాడు ప్రసాద్. ఆ తర్వాత తరచు వస్తూండేవాడు త్రిపురం ప్రత్యేకంగా ఆహ్వానించకపోయినా. వారంలో రెండు మూడు రోజులు వచ్చి, ఓ పదినిమిషాలు ఏవైనా కబుర్లు చెప్పి వెళుతూండేవాడు ప్రసాద్. గమ్మత్తుగ మాట్లాడతాడు. మధ్య మధ్యలో జోక్స్ ఎక్కువగా వేస్తూ, వినడానికి హాయిగా ఉంటుంది అతని కంఠం మ్యూజిక్ లాగా.

త్రిపురం ఎన్నడూ రావద్దని చెప్పలేదు. నాలుగయిదు నెలలు గడిచాక ప్రత్యేకంగా అతనికోసం ఎదురు చూడసాగింది. సాయంత్రాలు ప్రసాద్ మాటలు వినబడకపోతే ఎంతో నిస్సారంగా అనిపించేది.

త్రిపురం అనేకమంది మగాళ్ళని చూసింది. కాని వాళ్ళంతా విద్యార్థులు. వాళ్ళ వ్యక్తిగత విషయాల గురించి, నైజాల గురించి తెలియదు. బావుంటే బావున్నాడు అనుకునేది. అంతటితో ఆగిపోయేది ఆలోచన.

ప్రసాద్ అలాకాదు. అతని మాటల ధోరణిని బట్టి అతని ఆలోచనలు, స్వభావం, తెలివితేటలు, ప్రవృత్తి అంచనా వేయగలిగింది కొంతదాకా.

ఏ మాత్రం కల్మషం లేని వ్యక్తి. ఏదీ దాచుకోలేడు. ఈ సంగతి చెప్పచ్చా చెప్పకూడదా అనే ఆలోచన లేకుండా మాట్లాడతాడు. ఏ చీకూ చింతాలేని వ్యక్తిగా అనిపిస్తాడు త్రిపురానికి, త్రిపురం అట్టే మాట్లాడదు. ప్రసాద్ పరిధిలోని విషయాలు చాలా మామూలివి త్రిపురం దృష్టిలో. సినిమాలు, ఫేషన్లు, అతని స్వంత విషయాలు. త్రిపురానికి నచ్చే సంభాషణ ఆంగ్ల నవలల గురించి, సాహిత్యం గురించి, ప్రపంచ రాజకీయాల గురించి. అవి ప్రసాద్‌కి తెలియవు.

అందుకే శ్రోతగా మిగిలిపోతుంది ఎప్పుడూ.

ఒకోసారి ప్రసాద్‌కి తెలిసిపోతుంది చాలాసేపటినుంచి తనే మాట్లాడుతున్నాడని. ఆగిపోయి, "వాట్ మేడమ్, నన్ను కూసే గాడిదని చేసి చూస్తున్నారు. మీరు మాట్లాడండి" అంటాడు.

"ఏం మాట్లాడను? ఆకాశం చాలా ఎత్తుగా ఉంటుంది. నీలంగా కూడా ఉంటుంది. రాత్రుళ్ళు నక్షత్రాలు కనబడుతూంటాయి. ఒకోసారి మేఘాలు కూడా చాలా!" నవ్వుతుంది.

అప్పుడప్పుడు ప్రసాద్ పాడతాడు. ఎక్కువగా జానపద సాహిత్యం, పల్లెపదాలు, ఎక్కడైనా స్టేజ్ ప్రోగ్రాంలు ఇస్తే త్రిపురాన్ని ఆహ్వానిస్తాడు.

క్రమంగా త్రిపురం వంటరితనం మర్చిపోసాగింది. కాదు త్రిపురంలో ఎక్కువవసాగింది వంటరితనం. ఇదివరకు కన్నా వంటరితనం ఎక్కువవుతోంది. ప్రసాద్ వచ్చి కూర్చుని మాట్లాడుతున్నంత సేపు వంటరిగా ఫీల్ అవదు. కాని ప్రసాద్ వెళ్ళిపోయిన దగ్గరనుంచి వంటరిగా మిగిలిపోతుంది ఇంట్లో. ఆ కాసేపు ప్రసాద్ మరపిస్తాడు వంటరితనాన్ని. ఆ తర్వాత తనెంత వంటరిదో అర్ధమవుతుంది.

ప్రసాద్ అలా విషయాల్లో ప్రిన్సిపల్స్ ఉన్న మనిషి. గ్రాడ్యేషన్ అయిపోగానే ఉద్యోగం లేకపోయినా స్వతంత్రంగా బ్రతకాలనే నియమంతో హైదరాబాద్ వచ్చాడు టంగుటూరు నుంచి. ఓ స్నేహితుడి గదిలో ఉంటూ, పార్ట్ టైం పుస్తకాలు అద్దెకిచ్చే షాపులో పనిచేస్తూ, పార్ట్‌టైం మాసపత్రికలు తెప్పించి అమ్మే ఓ ఏజెంట్ వద్ద పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు ఏ మేరేజ్ ఫంక్షన్స్‌లోనో పాటలు పాడటం వల్ల కొంత డబ్బు వస్తూంటూంది అదనంగా.

డబ్బు విషయంలో ప్రసాద్ పూర్తిగా ప్రిన్సిపల్డ్ మాన్. ఒకరి దగ్గర ఓ నయాపైస తీసుకోకూడదు అనే తత్వం అతనిది. కష్టపడి సంపాదించాలి. ఆ సంపాదించిందే ఖర్చు పెట్టుకోవాలి. అందుకే అంత చవక బట్టలు వంటిమీద.

అనేక సందర్భాలలో త్రిపురం ఆ స్మగతి గ్రహించింది.

ఓ రోజు మాటల్లో, "మీ పుట్టినరోజు ఎప్పుడు మేడమ్?" అడిగాడు

"నాకు గుర్తులేదు. జూలైలో వస్తుందనుకుంటాను. మా అమ్మ బ్రతికున్నప్పుడు గుర్తుపెట్టుకుని చేసేది. తిధులు అవీ గుర్తులేవు నాకు."

ఓ రోజు ప్రసాద్ చెప్పాడు ఉత్సాహంగా వచ్చి.

"నేను మద్రాస్ వెళుతున్నాను రేపు."

"పాటలు పాడటానికా?"

"కాదు. పాటలకోసం ప్రయత్నించడానికి."

"ఎంతకాలంలో తిరిగి వస్తారు?"

"ఏదయినా సన్మానం చేసి ఇక్కడివాళ్ళు పిలిపిస్తే వస్తాను. రిడ్జ్‌లో చూడాలి నన్నప్పుడు బహుశ."

"కంగ్రాట్స్ ఇన్ ఎడ్వాన్స్."

"థాంక్ యు. "

✷✷✷

*(ఇంకావుంది)*




**NEW**
Click here to share your comments on this story

Click here to go to KOUMUDI Library